క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేస్తున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పామూరుపల్లి గ్రామంలో పామూరుపల్లి బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఘనంగా పాస్టర్ల దినోత్సవం


పాస్టర్‌ను సన్మానిస్తున్న చర్చి కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: అంతర్జాతీయ పాస్టర్ల దినోత్సవాన్ని పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో గల తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి సంఘ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి అధ్యక్షుడు దేవరకొండ శామ్యూల్ మాట్లాడుతూ.. మనుషులను సన్మార్గంలో నడిపించడంలో పాస్టర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. పాస్టర్ పులుకూరి అమృత్‌తేజ్‌ను చర్చి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. చర్చి ఉపాధ్యక్షుడు గుర్రం ఆర్డర్, సంఘ కమిటీ సభ్యులు ఎలకపాటి పోలయ్య, దారివేముల బాబి, గండి జైపాల్, జాన్ వినయ్‌కుమార్, టీఎస్ జైపాల్, చల్లగాలి నెహెమియా, వినుకొండ శ్యామ్ ప్రకాష్, పెద్దపోగు విజయకుమార్, దేవరకొండ లాజరస్, తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ కోర్టు నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు రూరల్: పట్టణంలోని టెన్నిస్ కోర్టు నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించినట్లు ప్రకాశం జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.కె.మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు లాన్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాదర్‌బాషా, కోశాధికారిగా రంగయ్య, ఉపకోశాధికారిగా యు.మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. గిద్దలూరులో లాన్ టెన్నిస్ అభివృద్ధికి సహకరిస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. లాన్ టెన్నిస్ అధ్యక్షుడు డా.రంగారెడ్డితో పాటుగా పలువురు క్రీడాకారులు నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తల్లికి పూజలు


ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ, స్థానిక కళాశాల రోడ్డులోని పోలేరమ్మ ఆలయం, మండలంలోని కోలభీమునిపాడు వద్ద ఉన్న ముద్దసానమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తులను ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అల్లూరి పోలేరమ్మ ఆలయ ఆవరణలోని నాగ శిలలు, పుట్టకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

పరాయి పంచన అంగన్‌వాడీలు


అసంపూర్తిగా ఉన్న కసినేపల్లె అంగన్‌వాడీ భవనం

- కొమరోలు మండలంలో అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య నిర్వహణ
- వైఎస్సార్ సీపీ హయాంలో 13 భవనాలకు రూ.91 లక్షలు మంజూరు
- ఏడాదిన్నర నుంచి నిర్మాణ పనులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కొమరోలు: అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పటికీ అరకొర వసతుల మధ్యే కొనసాగుతున్నాయి. సొంత భవనాల్లో, పూర్తి స్థాయి వసతులతో అంగన్‌వాడీలను నిర్వహించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా లక్షల రూపాయలు మంజూరు చేసి ప్రారంభించిన భవన నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. వివరాల్లోకి వెళ్తే.. కొమరోలు మండలంలో 75 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆరేళ్లలోపు పిల్లలు 2363 మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్నారు. 25 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 33 అంగన్‌వాడీ కేంద్రాలను రెంట్ ఫ్రీ భవనాల్లో, 17 కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా 13 కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించడానికి 7 లక్షల రూపాయల చొప్పున మొత్తం రూ.91 లక్షలను విడుదల చేసింది. కాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఆ భవన నిర్మాణాలను మొదలు పెట్టి కొన్నింటిని పూర్తి చేశారు. మరికొన్ని భవనాల నిర్మాణ పనులు ఎన్నికల కోడ్ కారణంగా మధ్యలోనే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వంలో నిర్మాణంలో ఉన్న భవనాలను పట్టించుకోకపోవడంతో 9 అంగన్‌వాడీ భవనాలు ఇప్పటికీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని తాటిచెర్ల–2, మోటు, అయ్యవారిపల్లె, నల్లగుంట్ల, మలికేపల్లె, కసినేపల్లె, ఇడమకల్లు–2, రాజుపాలెం ఎస్సీపాలెం, పామూరుపల్లె–2 అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ భవన నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి నిధులు, అనుమతులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ కార్యకలాపాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఒక్కో అంగన్‌వాడీ భవనానికి ప్రస్తుతం రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లయితే పనులు పూర్తి చేసే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలపై దృష్టి పెట్టి ఆ నిర్మాణాలను పూర్తి చేయాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.


మలికేపల్లిలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలి

- జేవీవీ సదస్సులో వక్తల డిమాండ్

గిద్దలూరు రూరల్:

పశ్చిమ ప్రకాశంలో సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం కోసం వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో ఆదివారం గిద్దలూరు అభివృద్ధిపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా «వెలిగొండ పూర్తయ్యేనా, తాగు, సాగు నీటి కష్టాలు తీరేనా?, ఎన్నాళ్లీ వ్యవసాయం, నీరు కరువైంది–బతుకు బరువైంది» అనే అంశంపై ఏర్పాటు చేసిన చర్చా వేదికలో వక్తలు మాట్లాడారు. అన్నదాతకు ఆసరా కల్పించాలంటే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితుల్లో రైతుల కష్టాలను పరిష్కరించాలంటే వెలిగొండ ప్రాజెక్టును కచ్చితంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల జనాభాకు తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకపోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు కానీ, వెలిగొండ ప్రాజెక్టు కోసం రూ.3600 కోట్లు నిధులు కేటాయించడం లేదన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయించేందుకు ప్రజలు ఉద్యమించాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన సమస్యపై మేధావి వర్గంతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం చాలా మంచి కార్యక్రమన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి, శాసన మండలి మాజీ సభ్యుడు కె.ఎస్.లక్ష్మణరావు, జేవీవీ నాయకులు పి.స్వరూపారెడ్డి, రిటైర్డ్ లెక్చరర్ ఎస్.నారాయణ రెడ్డి, విశ్వభారతి స్కూల్ కరస్పాండెంట్ రంస్వామి రెడ్డి, ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి, డాక్టర్ అన్వర్, సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, డాక్టర్ బ్రహ్మనందరెడ్డి, యూటీఎఫ్ నాయకుడు రమణా రెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



చర్చా వేదికలో మాట్లాడుతున్న నాయకులు

గౌడ కులస్తులు ఐక్యంగా ఉండాలి


ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మార్కాపురం టౌన్: గౌడ కులస్తులందరూ ఐక్యంగా ఉండాలని ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఇల్లూరి రంగస్వామిగౌడ్ కోరారు. ఆదివారం పట్టణ శివార్లలోని కపిలగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద నియోజకవర్గ గౌడ సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ కులస్తులు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.కాశయ్యగౌడ్, అధ్యక్షుడిగా కేవీ నరసింహారావు, కార్యదర్శిగా కె.నాగార్జునగౌడ్, కోశాధికారిగా వేములకోట శ్రీనివాసులతోపాటు పొదిలికి జూపల్లి ఏడుకొండలు, బి.శ్రీనివాసులు, కె.వెంకటేశ్వర్లు గౌడ్, ఎ.క్రిష్ణయ్య గౌడ్ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు. సంఘ అభివృద్ధికి కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు.

సగర కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలోని సగర కులస్తుల సమస్యలను పరిష్కరిస్తానని సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి సతికల రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జై జవాన్ సైనిక కార్యాలయంలో సగర సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రామకృష్ణ మాట్లాడుతూ.. సంఘ బలోపేతానికి కృషి చేస్తానని, ఏదైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకునిరావాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని కోరారు. సంఘ తాత్కాలిక కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వత భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు.


రామకృష్ణను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

కార్యక్రమంలో సంఘ ప్రధాన సలహాదారు వై.బాలశంకరయ్య, సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.వీరాంజనేయులు, కోశాధికారి ఎం.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామకృష్ణను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం: విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్సై సైదుబాబు సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్సీ బీసీ కాలనీలోని బీసీ హాస్టల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణా విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాలకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు ఎవరైనా ఇబ్బంది పెడితే తమకు సమాచారం అందించాలని తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు పంపే వెబ్ లింకులు ఓపెన్ చేయవద్దని, అసభ్యకర మెసేజులు పెడితే వెంటనే తల్లిదండ్రులతోపాటు హాస్టల్ వార్డెన్, పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి అన్నా రాము, కోశాధికారి టి.శ్రీనివాసరావు, లావణ్య, కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి, పీవీ కృష్ణారావు, జి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ ఎస్సైని సన్మానించారు.


ఎస్సై సైదులును సన్మానిస్తున్న నిర్వాహకులు

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు.

నలుగురు జూదరులు అరెస్టు

కంభం: మండలంలోని దేవనగరం గ్రామంలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.5,320 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరసింహారావు చెప్పారు.

స.హ చట్టంతో జవాబుదారీతనం



అర్ధవీడు బస్టాండ్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అర్ధవీడు: సమాచార హక్కు చట్టం ద్వారా పరిపాలనలో పారదర్శకత వచ్చిందని తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. స.హ చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం అర్ధవీడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అవినీతిని కట్టడి చేయడంతోపాటు, అధికారుల్లో బాధ్యతను పెంచడంలో స.హ చట్టం పాత్ర ప్రముఖంగా ఉందన్నారు. ఆర్ఐ శర్మ, రెవెన్యూ సిబ్బంది ప్రసంగి, రమణ, శ్రీను, రమేష్, ఇంతియాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాటమరాజుస్వామి వెండి శఠగోపం వితరణ


భక్తులు అందించిన నాగాభరణం, వెండి శఠగోపంతో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మార్కాపురం: పెద్దారవీడు మండలంలోని కాటమరాజు స్వామికి హైదరాబాద్‌కు చెందిన చెన్నుబోయిన శ్రీధర్, మాధవీయాదవ్ వెండి శఠగోపాన్ని అందజేసినట్లు కమిటీ బాధ్యుడు పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ ఆదివారం తెలిపారు. స్వామివారికి భక్తులు సమర్పించిన వెండి నాగాభరణాన్ని కూడా ఆలయంలో ఉన్న శివలింగానికి ఆదివారం అలంకరించినట్లు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న భక్తులు ఆలయానికి వస్తున్న సందర్భంగా మంచినీటి సౌకర్యంతో పాటు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇటీవలే ఆలయ పరిసరాల్లో 10 లక్షల రూపాయల వ్యయంతో 30 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు పీఎల్‌పీ యాదవ్ వివరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గంగరాజు, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, జీవీ సుబ్బారావు, ఈశ్వరకుమార్, రామయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అర్ధవీడు: మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఈ అపూర్వ సమ్మేళనానికి అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. పాఠశాలలో 1991–92లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా హాజరై సందడి చేశారు. చిన్ననాటి సంగతులు, తరగతి గదుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయుడు దద్దనాల పిచ్చిరంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు మాలపాటి సుబ్బారెడ్డి, పూర్వ విద్యార్థు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ


అక్కచెరువులో మూతపడిన ప్రభుత్వ పాఠశాల


కొత్తపల్లిలో సొంత భవనాలు ఉండి కూడా పిల్లలు రాక మూతపడిన ప్రభుత్వ పాఠశాల

- విద్యార్థులు ఉన్న చోట సొంత భవనాలు లేవు
- భవనాలు ఉన్న చోట విద్యార్థుల లేక మూసివేత

పొదిలి రూరల్: పొదిలి మండలంలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. విద్యార్థులు ఉన్న చోట సొంత భవనాలు లేకపోవడం, భవనాలు ఉన్న చోట విద్యార్థులు లేక మూసి వేసిన దుస్థితి. మూతపడిన స్కూల్ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ముఖ్యంగా పొదిలి మండలం పాములపాడు పంచాయతీలోని కాశీపురం ప్రాథమిక పాఠశాల, ఆముదాలపల్లి పంచాయతీలోని చల్లావారి పాలెం ప్రాథమిక పాఠశాలలకు సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనాల్లోనే పాఠశాలల నిర్వాహణ కొనసాగుతోంది. కూర్చోవడానికి బెంచీలు, తాగడానికి మంచినీరు, మధ్యాహ్న భోజనం తయారు చేయడానికి వంటశాల, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉంటే కొత్తపల్లి, అన్నవరం, అక్కచెరువు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలకు అన్ని వసతులతో కూడిన సొంత భవనాలు ఉన్నప్పటికీ విద్యార్థులు లేకపోవడంతో మూతపడ్డాయి.


చల్లావారిపాలెంలో అద్దె భవనంలో నడుస్తున్న ప్రాథమిక పాఠశాల